
ప్రజాశక్తి
సోమవారం 7 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం



అధ్యక్ష కార్యదర్శులు నీలకంఠం, శోభన్

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం, విశాఖ ఉమ్మడి జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం తలారిసింగి అంబేద్కర్ ఇండోర్ స్టేడియం ఆవరణలో ఈ సంఘం ఎన్నికలు జరిగాయి. మొత్తం 1057 ఓట్లకు గాను 510 ఓట్లు పోలయ్యాయి. ప్యానెల్ పద్ధతిలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో బీప్యానెల్ అభ్యర్థులు 10 ఓట్ల తేడాతో ఏ ప్యానెల్ పై విజయం సాధించారు. ఈ మేరకు బి ప్యానెల్ తరపున పోటీ చేసిన కంబిడి నీలకంఠం, శోభన్ బాబు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియను ప్రధాన అధికారి జీవీవీ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు వేగం సూర్యనారాయణ, ఎన్నికల అధికారులు ముఖి శేషాద్రి తదితరులు పర్యవేక్షణలో సజావుగా నిర్వహించారు.

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి

మూడు గ్రామాల గిరిబాలల నిరసన



ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శనలోచిన్నారులు, గిరిజనులు

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : మండలంలోని అడుగులపుట్టు పంచాయతీకి చెందిన సీకరిపుట్టు, తోరంగుల, సంపంగిపుట్టు మూడు గ్రామాలకు అంగన్వాడీ కేంద్రం లేక ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘ నేత కొమ్ము పృధ్వీరాజ్ అన్నారు. ఆదివారం మూడు గ్రామాలను సందర్శించారు. ప్రజలతోపాటు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ర్యాలీ చేశారు. ఈసందర్భంగా పథ్వీరాజు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు గతంలో పలుమార్లు విజ్ఞప్తు లు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. గర్భిణులు, బాలింతలు,చిన్నారులు పౌష్టికాహారం సరిగా అందక అవస్థలు పడుతున్నారని, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమరాడ అంగన్వాడీ కేంద్రానికి కాలినడకన అవస్థలు పడుతూ వెళితేగానీ పౌష్టికాహారం దక్కని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు గ్రామాలకు అందుబాటుగా ఉండే విధంగా అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, లేకుంటే ఐటిడిఎ ముట్టడి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్టిబాబు, ఆనందరావు, కామేశ్వరరావు, సుశీల, చంద్రకళ, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రం పాడేరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద ఈనెల 7న సోమవారం ఆశా వర్కర్ల ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆశా వర్కర్లపై అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు, 4జీ సిమ్స్ ఇవ్వాలని, సచివాలయాలు, సబ్ సెంటర్లలో పగలంతా కూర్చోబెట్టడం, రిజిస్టర్లలో సంతకాలు చేయించడం ఆపాలని, పిహెచ్‌సిలకుపిలిపించిన ప్రతిసారి టిఏ,డిఏ చెల్లింపు, తదితర డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు

శిశుమరణాలను అరికట్టడంలో వైఫల్యం



బాధిత దంపతులను ఓదార్చుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి- హుకుంపేట: ప్రభుత్వ వైఫల్యం వల్ల గిరిజన ప్రాంతంలో శిశు మరణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని మత్స్యపురం పంచాయతీ ఊటిగెడ్డ గ్రామానికి చెందిన కొర్ర సుబ్బారావు సుందరమ్మ దంపతుల మూడు నెలల బాబు శనివారం రాత్రి హఠాత్తుగా మరణించిన విషయం తెలుసుకుని ఆదివారం ఉదయం గ్రామంలో పర్యటించారు. బాలుని మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత దంపతులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో శిశు మరణాలను నియంత్రించడానికి ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుస మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మత్స్యపురం నేతలు సుబ్బా రావు, సాంబ, మాజీ సర్పంచ్ రాజారావు, అరకు అసెంబ్లీ ఎస్‌టి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్ర సంతోష్ కుమార్, సెక్రటరీ కిల్లో జగన్ కుమార్, అధికార ప్రతినిధి శంకర్ నాయుడు, మత్స్యరాజు దొర, అబ్రహం, మహేష్, శ్రీను, కొర్ర జోగులు, తామేష్ పాల్గొని, మృతి చెందిన బాలుడికి నివాళులర్పించారు.

కుంగిపోయిన మంచినీటి బావి

నాలుగు విద్యాలయాలకు చెందిన విద్యార్థుల అవస్థలు

తాగునీటికి, కాలకృత్యాలకు చుక్కనీరు దొరకని స్థితి



కుంగిపోయిన గురుకుల పాఠశాల మంచినీటి బావి

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రంలోని సీతగుంట పంచాయతీ రోగులపేట, కుమ్మరి పుట్టు గ్రామాల మధ్యన గిరిజన గురుకులానికి చెందిన 34 ఏళ్ల మంచినీటి బావి శనివారం రాత్రి కుంగి పోయింది. 1990-91లో నిర్మించిన ఈ బావి నీటినిగురుకులం కళాశాల, పాఠశాల నోడల్ ఏకలవ్య, ముంచింగి పుట్టు, పెదబయలు ఇఎంఆర్ఎస్ పాఠశాలలకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థులు వినియోగి స్తున్నారు. శనివారం రాత్రి ఇది కుంగిపోవడంతో ఆదివారం ఉదయం కాలకృత్యాలకు విద్యార్థులు నానాఇబ్బందులు పడ్డారు

కుంగిపోయిన బావి నుంచి నాలుగు విద్యాలయాలతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది క్వార్టర్స్‌కు నీటి సరఫరా జరుగుతోంది. ఆదిఆరం ఉదయం నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులకు అల్పహారానికి, మధ్యాహ్నం భోజనానికి చాలా అవస్థలు పడ్డారు విద్యార్థుల సహకారంతో అందుబాటులో ఉన్న చేతి పంపు నుంచి నీటిని తోడుకొని వంట కార్యక్రమలు నిర్వహిస్తున్నారు. నాలుగు విద్యాలయాలకు ఒక్కటే మంచినీటి ట్యాంక్ కావడం, విద్యుత్ మోటర్ అమర్చిన నీటి బావి వర్షాలకు కుంగిపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు.ముఖ్యంగా ఇఎంఆర్ఎస్ హాస్టల్‌లోని బాలికలు పడిన అవస్థలు వర్ణనాతీతం. కూరుకుపోయిన బావిలో చెత్తాచెదారం నిండిపోవడంతో, బురద నీరు ఉండడంతో వినియోగానికి వీలులేని స్థితి ఉంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, ఆయా పాఠశాలలతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది క్వార్టర్స్‌కు తక్షణం మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చట!

- మూడు నెలలకే పాడైన దిగువ శోభ తారురోడ్డు
- నిర్మాణంలో నాణ్యత, పర్యవేక్షణా లోపమే కారణం
- మన్యవాసుల అవస్థలు.. పట్టని అధికారులు



దిగువశోభ వద్ద నిర్మించిన మూడు నెలలకే శిథిలమైన తారురోడ్డు

ప్రజాశక్తి -అనంతగిరి : మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన బిటి రోడ్డు మూడునెల్లోనే పాడవ్వడంతో మన్యవాసులు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు. నిర్మాణసమయంలో సంబధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాసిరకపు పనులు చేపట్టడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమౌతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎగువశోభ పంచాయతీ పరిధి దిగువశోభ నిర్మించిన తారురోడ్డు పరిస్థితి అచ్చంగా ఇలాగే ఉంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిధులతో, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో బొర్రా మెయిన్ రోడ్డు నుండి బిర్జివలస, పోర్నపాదర్, దిగువశోభ మీదుగా ఎగువశోభ వరకు తారురోడ్డు నిర్మాణాన్ని మేనెలలో పూర్తి చేశారు. అలాగే గత ఏడాది ఎగుశోభ నుండి సరసుపాదర్. పూలగుడ. మీదుగా బీసుపురం, అరకు మైయిన్ రోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టగా ఆ రోడ్డు కూడా ఆరు నెల్లోనే మరమ్మతులకు గురైంది.

ఎగువశోభ సమీపంలో మలుపు గత ఏడాది తుఫాన్ కారణంగా రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది ఇప్పటివరకు కొట్టుకు పోయిన రోడ్డు మరమ్మతులు చేపట్టలేదు. అలాగే రక్షణగోడ నిర్మాణ పనులను చేపట్టలేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కాంట్రాక్టర్లు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని, దీంతో మన్యంలోని తారురోడ్ల దుస్థితి ఇలా తయారౌతోందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నారు.



ఎగువశోభ సమీపంలో అసంపూర్తి రక్షణగోడ పనులు

9న ఆదివాసీ హక్కుల దినంగా జరపాలి

ఆదివాసీ గిరిజన సంఘం



శరభగుడలో గిరిజన సంఘం జెండాను ఎగురవేస్తున్న నేతలు

ప్రజాశక్తి - అరకులోయ/ అరకు రూరల్ : ఈనెల9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10 వరకు ఆదివాసీ హక్కుల వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా జరపాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. ఆదివారం అరకువేలి మండలం సరభగుడ గ్రామంలో మండల నాయకులు కె మగ్గన్న అధ్యక్షతన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, చట్టాలు, సంస్కృతి, సాంప్రదాయాలు,ఆచారాలను గుర్తించి ప్రపంచ ఐక్యరాజ్యసమితి 29 ఏళ్ల క్రితమే డిక్లరేషన్ చేసినప్పటికీ మనదేశంలో అమలుకు ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో 700 ఆదివాసీతెగలు 75 ఆదిమ జాతి తెగలు జీవిస్తున్నారని వారియొక్క హక్కులు గుర్తించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరాకరించడం దుర్మార్గమన్నారు. అడవులపై ఆదివాసులు సాధించిన హక్కులు, చట్టాలు తొలగించి కార్పొరేట్ కంపెనీలకు అటవీ సంపద, మైనింగ్ కట్టబెట్టడానికి పాలకులు కుట్ర చేయడం అన్యాయమన్నారు.

స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ళు దాటినా ఆదివాసులకు తిండి కోసం వలసలు, విద్య, వైద్య సదుపాయాలు ఉపాధిఅవకాశాలు లేకుండా దుర్భర జీవితం అనుభవిస్తున్నా రన్నారు. రాష్ట్రంలో ఆదివాసులపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడుతోందని బోయ/వాల్మీకులకు ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానించడం, ఏజెన్సీలో20 రకాల ప్రభుత్వ శాఖల్లో శతశాతం గిరిజనులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే జిఒ3 ని రద్దుచేసి మూడేళ్లు గడుస్తున్నా, పునరుద్ధరణకు కనీస చర్యలు చేపట్టకపోవడం, చింతపల్లి, అనంతగిరి మండలాల్లో వందలాది గ్రామాల ఆదివాసులకు జలసమాధి చేసే హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం వంటి అనేక గిరిజన వ్యతిరేక చర్యలకు జగన్మోహనరెడ్డి పాల్పడుతున్నారన్నారు. ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కిల్లో సహదేవ్, పి.రాము, కిల్లో కేశవ, మహేష్, కార్తీక్, సాయి, లక్ష్మణ్, విష్ణు, కల్యాణ్, రాంబాబు, కొండబాబు, కొర్ర ప్రసన్న పాల్గొన్నారు.

వరద బాధితుల పట్ల నిర్లక్ష్యం

- సహాయక చర్యలు అంతంత మాత్రమే..
- దెబ్బతిన్న కూరగాయల పంటలు
- నష్టపరిహారం చెల్లించాలని బాధితుల వేడుకోలు



దెబ్బతిన్న దొంటకాయల తోట

ప్రజాశక్తి- విఆర్.పురం

గోదావరి వరదలు కారణంగా ముంపునకు గురైన చింతూరు డివిజన్‌లోని విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు మండలాల్లోని బాధితుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుంది. 15 రోజుల పాటు కొండలపైనా, గుట్టలపైనా ఇబ్బంది పడ్డ బాధితులను ప్రభుత్వం గాలికొదిలేదిలేసింది. రెండు మూడు రకాల కూరగాయలు, రూ.2వేలు చేతులో పెట్టి తమ పని అయిపోయినట్లు చేతులు దులుపేసుకుంటుంది.

గోదావరి, శబరి నదులు ఉప్పొంగడంతో జులై 20వ తేదీన నుండి 15 రోజుల పాటు అడవుల్లోనూ, రోడ్లమీద, స్కూల్ భవనాల వద్ద గుడారాల్లోనూ, పునరవాస కేంద్రాల్లోనూ కరెంటు లేక దోమలు, విషపురుగుల మధ్య బాధితులు కాలం వెల్లబుచ్చారు. నిత్యావసరాలు కూడా సరిగా ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద ఉధృతి తగ్గిన తరువాత గ్రామాలకు వచ్చిన బాధితులను ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. కేవలం తక్షణ సాయం కింద రూ.2వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. గ్రామాలు మునిగిన, గ్రామాలకు చుట్టూ నీరు చేరిన అన్ని గ్రామాల్లోనూ ప్రతి కుటుంబానికీ రూ.10వేలు ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు. వరద సమయంలో తమ సామగ్రిని ఇంటి నుండి పునరావాస కేంద్రాలకు తరలించడానికి, వరద తగ్గిన తరువాత ఇంటికి తిరిగి తెచ్చుకోవడానికి రూ.20వేలు వరకు ఖర్చు కాగా, ఆ మొత్తం ప్రభుత్వం చెల్లించడం లేదు. ఈ నెల 8న ముఖ్యమంత్రి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటనకు వస్తున్న నేపథ్యంలో బాధితులను ఆదుకొనేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాధిత రైతులు పోసిబాబు, పోసి ప్రసాద్, శివాజీ

ముంపు మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ వరద నష్టాన్ని వెంటనే ఎన్యూమరేషన్ చేయించాలని, ఆస్తి నష్టం అంచనా వేసి నష్టపరిహారం అందించాలని, వ్యాధులు ప్రబలకుండా తక్షణమే వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు. ముప్పుకు గురైన కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ బ్లీచింగ్ కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న కూరగాయల పంటలు

మండలంలోని ఒడ్డుగూడెం, రాజుపేట గ్రామాల్లో దొండ, చిక్కుడు, బెండ వంటి కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట చేతికి వచ్చిన సమయంలో గోదావరి వరదలు కారణంగా 15 రోజుల పాటు పంట ముంపులో ఉండిపోవడంతో పూర్తిగా నాశనమైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు పోవడంతో ఎకరానికి రూ.60 వేలు వరకు రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలోని రాజుపేట కాలనీ గ్రామానికి చెందిన ముంజుపు పోసిబాబు, ముంజపు పోసి ప్రసాద్, ముత్యాల శివాజీలు 7 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేయగా, ఆ మొత్తం పంటలు దెబ్బతిన్నాయి. కూరగాయల పంట పండిస్తూ జీవనం సాగిస్తున్నామని, వరదలకు పంటలు దెబ్బతిన్నా అధికారులు ఇంతవరకు తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పంట నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పూర్తిగా నాశనమైన చిక్కుడు తోట

సామూహిక సత్యనారాయణమూర్తి వ్రతాలు

ప్రజాశక్తి -అడ్డతీగల: మండల కేంద్రంలో సాయి సన్నిధి ఫంక్షన్ హాల్ వద్ద అన్నవరం సత్యనారాయణస్వామి వారి సామూహిక వ్రతాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబర్ కారుకోడి పూజ హాజరయ్యారు. పవనగిరి దేవస్థానం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ స్వామీజీ తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో సుమారు 300 మంది వ్రతాన్ని ఆచరించినట్లు తెలిపారు. దేవస్థానం సూపరింటెండెంట్ పెన్నాడ వెంకటేశ్వరరావు, సంఘం వీర్రాజు, పురోహితులు, శ్రీనివాస్, రాజేంద్ర, వి త్రిమూర్తులు, రామరాజు పాల్గొన్నారు



రెగ్యులేటరీ డ్యామ్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ సౌధ చీఫ్ ఇంజినీర్ పర్యటన

ప్రజాశక్తి -సీలేరు

విజయవాడ విద్యుత్ సౌధ చీఫ్ ఇంజనీర్ (సివిల్) కోటేశ్వరరావు ఆదివారం ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. మెయిన్ డ్యాం, రెగ్యులేటరీ డ్యాం జలాశయాలను పరిశీలించారు. సీలేరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి విద్యుత్ ఉత్పత్తి జరిగే యూనిట్లు పనితీరుపై ఆరా తీశారు. మరమ్మతులకు గురైన నాలుగో యూనిట్ పనులు ఏ విధంగా జరుగుతున్నాయని స్వయంగా పరిశీలించారు. సీలేరులో నూతనంగా నెలకొల్పబోయే 1350 మెగావాట్ల సామర్థ్యం గల టన్నెల ప్రాజెక్టుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలన చేశారు. అనంతరం దిగు సీలేరు డొంకరాయి జలవద్యుత్ కేంద్రానికి చేరుకొని అక్కడ జల విద్యుత్ కేంద్రం పనితీరుపై తనిఖీలు నిర్వహించారు. డొంకరాయి జలాశయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పొల్లూరు చేరుకొని జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి తీరును స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో (విజయవాడ విద్యుత్ సౌద) ఎస్ఇ హైడల్ శేఖర్, సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

పురుగు మందు పిచికారీ డ్రోన్లకు రుణం సాయం

ప్రజాశక్తి-చింతూరు

గ్రామీణ నిరుద్యోగ పట్టభద్రులకు రైతు భరోసా కేంద్రం ద్వారా పురుగు మందుల పిచికారీ డ్రోన్ల కోసం రుణ సాయం పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నంద్ తెలిపారు. మండలంలోని ఎర్రంపేట రైతు భరోసా కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగులైన గ్రామీణ వ్యవసాయ పట్టభద్రులు, డిప్లమా అగ్రికల్చర్ హోల్డర్లు ఐదుగురు సభ్యులుగా ఏర్పడి ఒక సంఘాన్ని స్థాపించుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుడు తప్పనిసరిగా పాస్‌పోర్టు కలిగి ఉండాలని, డ్రోన్ల కోసం ముందుగా రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తే ఒక యూనిట్ రూ.10 లక్షల విలువైన మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పొందవచ్చని చెప్పారు. మళ్లీ తిరిగి నాలుగు లక్షల రూపాయలు రెండు నెలల కాల వ్యవధిలో సబ్సిడీ అందజేయబడుతుందని తెలిపారు. ఈ డ్రోన్ సాయంతో పంటలపై చీడపీడలను తొలగించే పురుగుమందులను త్వరితగతిన పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్‌ను ఇతరులకు కిరాయికి ఇచ్చి లబ్ధి పొందవచ్చని, తద్వారా వచ్చే సొమ్మును తిరిగి రుణం తీసుకున్న ఖాతాకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. దీనికిగాను పట్టభద్రులైన వ్యక్తులకు ముందుగా డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఆర్‌డికె కేంద్రంలోని అగ్రికల్చర్ అధికారులను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 8331056252 (జిల్లా వ్యవసాయ అధికారి), 7995086759 (ఉద్యానవన శాఖాధికారి) నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి ఎ.రమేష్ కుమార్, ఏవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



సీలేరు సంతలో టమాట, ఇతర కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

మండుతున్న కూరగాయల ధరలు

ప్రజాశక్తి -సీలేరు

కూరగాయల ధరలు ఇంకా మండుతూనే ఉన్నాయి. జీకే వీధి మండలం సీలేరు వారపు సంతలో టమాటా, పచ్చిమిరపకాయలు గత వారంతో పోల్చితే కొద్దిగా తగ్గినప్పటికీ ఇంకా సామాన్యులకు అందుబాటులోకి రాలేదు. గత ఆదివారం సంతలో కిలో టమాటా రూ.220 విక్రయించగా, ఈ వారం రూ.150కి అమ్మకాలు చేశారు. పచ్చిమిరపకాయలు గత వారం కిలో రూ.200 ఉండగా, ఈ వారం రూ.160 ధర పలికింది. దీంతో దినసరి కూలీలు, మధ్యతరగతి కుటుంబీకులు టమాటా, పచ్చిమిరపకాయలు ఆర కొరకగానే కొనుగోలు చేశారు. మిగిలిన కూరగాయల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కాలీఫ్లవర్, బీట్‌రూట్, క్యారెట్, బీన్స్ వంటివి కిలో రూ.100కు విక్రయించ, చిక్కుడుకాయలు ఒక కిలో రూ.160కు వ్యాపారులు అమ్మకాలు చేశారు. కూరగాయల ధరలకు అధిక రేట్లు ఉండడంతో ఈ వారం కూడా మారుమూల ప్రాంతాల నుంచి గిరిజనులు వాటిని కొనుగోలు చేయడానికి వెనుకడుగు వేశారు. కూరగాయల ధరలు ఇదే విధంగా కొనసాగితే దినసరి కూలీలు కొనుగోలు చేయడం కష్టమేనని ఆందోళన గురవుతున్నారు.

చెట్టును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి- మోతుగూడెం

అల్లూరు సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం పరిధిలోని గొడ్ల గూడెం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు విశాఖపట్నం జిల్లా మధురవాడ భద్రాచలం వెళ్తూ ఈ ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్ర మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణహాని జరగలేదు. గాయపడిన వారిని స్థానిక తరలించి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు.

తూతూ మంత్రంగా మలాథియాన్ పిచికారీ!

అధికారుల పర్యవేక్షణ లోపంతో నామమాత్రంగా పనులు

దోమలు విజృంభణ, జ్వరాల నియంత్రణలో నిర్లక్ష్యం



మామూలు స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఎపిడమిక్ సీజన్‌లో ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా చేపట్టే మలాథియాన్ పిచికారీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా నామమాత్రంగా జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో దోమల విజృంభించి, సీజనల్ విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. వర్షాకాలంలో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో పరిసర నివాస గృహాల్లో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముంటుంది. దీంతో అధికారులు దోమల వ్యాప్తి చెందకుండా ముందుగా హై రిస్క్ గ్రామాలను గుర్తించి ఈ స్ప్రేయింగ్ పనులను చేపడుతున్నారు. గ్రామంలోని వీధి కాలువలతో పాటు నివాస గృహ బయట ,లోపల స్ప్రేయింగ్ చేయాల్సి ఉంది. కానీ ఇక్కడి సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా వీధి కాలువల్లో, నివాస గృహ బయట గోడల్లో స్ప్రేయింగ్ పైపైన అడపాదడపాగా కొట్టి వదిలేస్తున్నారు. అది కూడా పూర్తిస్థాయిలో పిచికారీ చేయకుండా కూరగాయల పంటలకు వినియోగించే పురుగుల మందు డబ్బాలతో స్ప్రేయింగ్ చేస్తున్నారు.

మండలంలోని డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాకరవలస, బల్లగరువు, కొర్రంగి, కీలంగొంది, తోట వలస, పంతలచింత, చంపపట్టి, ఏడుపాడు అమలగుడ గ్రామాల్లో స్ప్రేయింగ్ చేశారు. రోజుకు 20 గృహాల్లో 6 మంది సిబ్బందితో చేయాల్సి ఉండగా, కేవలం ఇద్దరితో గ్రామంలోని సుమారు 50 నుంచి 60 గృహాల్లో పైపైన తూతూ మంత్రంగా స్ప్రేయింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రధానంగా మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి గిరిజన గ్రామాల్లో ఈ చర్య చేపడుతుంటే, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్ప్రేయింగ్ తూతూ మంత్రంగా జరుగుతుండడంతో వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, దోమల నివారణ మందులు పిచికారీలో నిర్లక్ష్యం చూపుతున్న బాధ్యులపై చర్యలు చేపట్టడంతోపాటు, పగడ్బందీగా స్ప్రేయింగ్ జరిగేలా చూడాలని మండల గిరిజనులు కోరుతున్నారు.

400మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్, శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అరకువేలి శారదా నికేతన్ పాఠశాలలో ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 400 మంది చిన్న పిల్లలకు,పెద్దలకు వైద్యపరీక్షలు చేసి, మందులు ఇచ్చారు ముఖ్య అతిథిగా పాల్గొన్న అరకువేలి ఎంపిపి వంతాల త్రినాథరావు మాట్లాడుతూ, మన్యవాసుల వైద్యఆరోగ్యానికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించిన కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్, శారదా ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. శిబిరంలో డాక్టర్ అవినాష్, రామస్వామి సహకారం అందించారు. కార్యక్రమంలో శారదా నికేతన్ స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు వి ఉమామహేశ్వరరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ చిరంజీవులు , బాబూరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి త్రినాధరావు

ప్రభుత్వాల విధానాలతో కార్మిక జీవితాలు చిన్నాభిన్నం

9న క్విట్ ఇండియా స్ఫూర్తితో జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

ఆందోళనకు సమాయత్తమౌతున్న కార్మిక, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలతో కార్మికుల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని వామపక్ష పార్టీలు, సిఐటియు, కార్మిక, గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రాల్లో ఈనెల 9న క్విట్ ఇండియా స్ఫూర్తితో జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు సమాయత్తమౌతున్నారు. ప్రభుత్వాలు అసంఘటిత కార్మికుల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో లేవని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ కార్మికులను బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్, పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్మేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు రోడ్డు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని మండిపడ్డారు. మూడు నల్లసాగు చట్టాలను తెచ్చి, రైతాంగాన్ని, భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నాలు చేసినా, అన్నదాతల ఆందోళనతో మోడీ ప్రభుత్వం దిగిరాక తప్పలేదన్నారు. మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిస్తున్నారు తొమ్మిదేళ్ల మోడీ పాలనలో . కార్మికుల సమస్యలేవీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్న డిమాండ్ మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శిస్తున్నారు. స్కీం వర్కర్ల శ్రమను దోచుకోవడం తప్ప వారిని పర్మినెంట్ చేయడం లేదని, కీలక రంగాలలో సహ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్న పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేస్తుంటే బిజెపి ప్రభుత్వం కొత్త వాటిని ఏర్పాటు చేయకుండా, పాత వాటిని రక్షించకుండా ప్రజలకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కేంద్రం కార్మికవర్గంపై దాడికి దిగుతోందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరిస్తున్నారు. మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 9న క్విట్ ఇండియా స్ఫూర్తితో జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు సామాజిక భద్రత లేదు..

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక బాధ్యత లేదు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికుల సమస్యల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోంది. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు కావడం లేదు. ఇపిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



వి.ఉమామహేశ్వరరావు
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ, వెట్టి చాకిరి చేయిస్తోంది. శ్రమ దోపిడికి గురి చేస్తోంది. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీని గద్దె దింపే వరకు పోరాడాలి. బిజెపి ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా, ముక్తకంఠంతో వ్యతిరేకించాలి.



బి.చిన్నయ్య పడాల్,
సిఐటియు జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ రంగం సర్వనాశనం..

మోడీ ప్రభుత్వ కార్పొరేటీకరణ విధానాలతో ప్రభుత్వరంగం సర్వనాశనమౌతోంది. దేశ సంపదను ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోంది. పోరాడి సాధించుకున్న చట్టాలను తొలగించి. మోడీ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు కేంద్రానికి మోకరిల్లుతుండడం శోచనీయం.



కె.రాధాకృష్ణ
గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి

కార్మిక చట్టాల నిర్వీర్యం తగదు..

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. 2008లో వైఎస్ హయాంలో పోరాడి తెచ్చుకున్న సంక్షేమ చట్టాన్ని జగన్ సర్కారు నిర్వీర్యం చేస్తోంది. కార్మిక హక్కులను కాలరాస్తూ, యాజమాన్యాలు, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సమిష్టి పోరాటం అవసరం.



ఎస్.నాగరాజు,
సిఐటియు జిల్లా నాయకుడు



డుంబ్రిగుడ పశువైద్యకేంద్రం

శిథిల భవనంలో పశువైద్య కేంద్రం

-వర్షానికి కారుతున్న రేకులు

-తడిసి పాడవుతున్న మందులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం పూర్తిగా శిథిలావస్థలో చేరుకుంది. వర్షం కురిసినప్పుడు పైకప్పు రేకుల నుంచి వర్షం నీరు లోపల కారుతుండడంతో మందులన్నీ తడిసి పాడౌతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. శిథిలభవనంలో విధుల నిర్వహణకు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. భవన గోడలతోపాటు పైకప్పు రేకులు కూడా పూర్తిగా పాడవ్వడంతో ఏక్షణాల కూలిపోతాయో నన్న భయాందోళనలో బిక్కు బిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సొంత భవనం లేకపోవడంతో ఆర్‌అండ్‌బి శాఖకు చెందిన భవనంలో 15 ఏళ్ల నుంచి పశువైద్యకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సొంత భవనం మంజూరు చేయాలని గతంలో పలుమార్లు విన్నవించగా, రెండేళ్ల క్రితం ప్రభుత్వం పశు వైద్యకేంద్రానికి స్థలాన్ని కేటాయించింది కానీ ఇప్పటికీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో, పరాయిపంచన, శిథిల భవనంలోనే కాలం వెల్లదీయక తప్పడం లేదు. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, పశువైద్యకేంద్రానికి సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిబ్బంది, మండల గిరిజనులు కోరుతున్నారు.



డముకు వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో సందర్శకుల తాకిడి నెలకొంది. నెల రోజులుగా వెలవెలబోయిన బొర్రాగుహలు, కటికి, తాడిగుడ, చిటంపాడు జలపాతాలు, అలాగే డముకు వ్యూపాయింట్, అనంతగిరి కాఫీ తోటలు, చాపరాయి ఆదివారం సెలవు దినం కావడంతో విదేశీ పర్యాటకులతోపాటు జిల్లాలోనూ, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది సందర్శకులతో కిటకిటలాడాయి. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జలపాతాల్లో జలకళ సంతరించుకోగా, పిల్లలు, యువత కేరింతలు కొడుతూ, సెల్ఫీలతో సందడి చేశారు. బొర్రాగుహల సందర్శన తర్వాత కాఫీ ప్లాంటేషన్, సుంకరమెట వ్యూపాయింట మీదుగా అరకు. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, డుంబ్రిగుడ చాపరాయి ఇలా పర్యాటక ప్రాంతాల్లో జనసందడి నెలకొంది.

11న చలో అడ్మిన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికులకు నిలిపేసిన రూ.2400 చెల్లించాలని కోరుతూ ఈ నెల 11న చలో అడ్మిన్ కార్యక్రమం చేపడుతున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం నిర్ణయించింది. ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జులై 13న ఇడి వర్క్స్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఉక్కు యాజమాన్యం హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు చెల్లింపునకు చర్యలు చేపట్టకపోతే వేలాదిమంది కార్మికులతో చలో అడ్మిన్ చేపడతామని హెచ్చరించారు.

'గంగవరం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల సంఘం నాయకులు పులి రమణారెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు ఆదివారం నాటికి 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను రమణారెడ్డి ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను విధులలో చేర్చుకోవాలని డిమాండ్‌చేశారు. సమస్య జటిలం కాకుండా పరిష్కరించాలని యాజమాన్యానికి సూచించారు. నిర్వాసిత నాయకులు గోందేశి సత్యారావు, వైసిపి నాయకులు గొందేసి మహేశ్వరరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు ముడసిరి శ్రీనివాసరావు, సుమన్‌రెడ్డి, బస అప్పలరెడ్డి, అప్పారావు, గోపి, అప్పలరాజు, తాతారావు, యళ్లాజీరావు, పోలారావు, బాలకృష్ణ, నూకరాజు, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

శస్త్రచికిత్స రహిత ఇండియా లక్ష్యంగా వాక్‌థాన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ వాస్కులర్ డేను పురస్కరించుకొని 'శస్త్రచికిత్స రహిత ఇండియా', 'వాక్ ఎ మైల్ టు లివ్ విత్ ఎ స్మైల్' కాన్సెప్ట్‌తో బీచ్ రోడ్డులో ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత జీవన శైలిలో అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఆర్గనైజర్, సీనియర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ దివాకర్ బెండి మాట్లాడుతూ ఈ సంస్థను 1994 ఆగస్టు 6న చెన్నయ్‌లో స్థాపించారన్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఆదివారం జాతీయ వాస్కులర్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై మొండి వైఖరి సరికాదు

ప్రజాశక్తి - సీలేరు : విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం మొండివైఖరి సరికాదని స్థానిక విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు వై.సత్తిబాబు వై.ధర్రాజు అన్నారు. జికె వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ తలపెట్టిన వర్క్ టు రూల్ కార్యక్రమం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం, ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల పట్ల అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. ఏపీ జెన్కో యాజమాన్యం తమకు రావలసిన మూడు డీఎలు బకాయి వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఈపీఎఫ్‌ను జిపిఎఫ్‌లో మార్చాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. 74 మందికి రక్తపరీక్షలు, ఒకరికి ఇసిజి, తొమ్మిది మందికి థైరాయిడ్ పరీక్షలు, 15 మందికి ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, 10 మందికి ఫిజియోథెరపీ చేశారు. రోగులకు, సహాయకులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, మఠం మేనేజర్ స్వామీ రఘువీరానందజీ మహరాజ్, తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమొను శ్రీనివాస్, వాలంటీర్ గాదిరాజు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు

ప్రజాశక్తి - పెందుర్తి, కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 7న జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలకు పారిశుధ్య కార్మికులు సిద్ధమవుతున్న నేపథ్యంలో వారికి నాయకత్వం వహిస్తున్న నేతలపై పోలీసులు ముందస్తు నిర్బంధం ప్రయోగించారు. ఆదివారం సాయంత్రం సిఐటియు విశాఖ నగర కార్యదర్శి బి.జగన్‌ను, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు నూకరాజును వారి ఇళ్లకు వెళ్లి అరెస్టు చేసి పెందుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో ఖండించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరితే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు.

ఆదుకోకపోతే అవస్థలే..

ఆందోళనకరంగా విద్యుత్ ఛార్జీలు - నేడు ఫెర్రో పరిశ్రమ కార్మికుల ధర్నా

ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఫెర్రో పరిశ్రమలకు పెంచిన విద్యుత్ ఛార్జీల భారం ప్రభావం కార్మికుల జీవనోపాధిపై పడింది. ఎనర్జీ ఇన్సెంటివ్ ఇండస్ట్రీస్ పేర డిమాండ్ ఛార్జీలను పెంచడంతో ఫెర్రో ఎల్లాయిస్ ఉత్పత్తి వ్యయం పెరిగింది. ముడిసరుకుల ధరలు పెరగడంతో యాజమాన్యాలు కంపెనీల నిర్వహణపై సతమతమవుతున్నాయి. పరిశ్రమలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కంపెనీలు వినియోగిస్తున్న విద్యుత్‌పై ఈ ఏడాది డిమాండ్ ఛార్జీలు, ట్రూఅప్, ఇంధన ఛార్జీలు, వినియోగ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఇడి) పెంచింది. యూనిట్‌కు ఆరు పైసలున్న ఇడి ఛార్జీలను రూపాయికి పెంచడంతో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు విలవిల్లాడుతున్నాయి. ఈ భారాలు భరించలేక యాజమాన్యాలు పరిశ్రమలు మూసేయాలని ఆలోచిస్తున్నాయి.



జిల్లాలోని ఓ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో అభిజిత్, మైతాన్, లలిత, సుందరం ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మంది సెజ్ నిర్వాసిత, పరిసర పేద కుటుంబాల ప్రజలు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమలు మూసేస్తే ఆ కుటుంబాలు ఉపాధి కోల్పోనున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహాల్లేక, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల్లేక, ముడిసరుకు ధరలు పెరుగుతుండడంతో సరోజిని, ఆల్బస్ పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. విద్యుత్ ఛార్జీలు పెంచడంతో టన్నుకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తోందని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇతర దేశాల్లో యూనిట్ రూపాయి యాభై పైసల నుంచి రెండు రూపాయల మధ్య వుండగా, రాష్ట్రంలో యూనిట్ ఎనిమిది రూపాయలకుపైగా వున్నట్లు చెబుతున్నారు. ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) నిబంధనల ప్రకారం సామర్థ్యపు విద్యుత్ వినియోగించకపోయినా లోడ్‌లో ప్రతినెలా 80 శాతం డిమాండ్ ఛార్జీలను పరిశ్రమలు చెల్లించాల్సివుంది. పరిశ్రమలపై పడుతున్న విద్యుత్ భారాలను ఉపసంహరించుకొని కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా చూడాలని సిఐటియు నేతృత్వంలో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నారు.

ఫెర్రో పరిశ్రమలకు ప్రోత్సాహకాలివ్వాలి

ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై ఏడాదికి రూ.700 కోట్ల భారం పడుతుంది. పరిశ్రమల యాజమానులు ఆర్థిక భారం భరించలేక కంపెనీలను మూసేస్తామని అంటున్నారు. కార్మికులకు జీతాలు పెంచడంలేదు. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి. కార్మిక కుటుంబాల జీవనోపాధి దెబ్బతినకుండా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

ఆర్.రాము, సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు

భారత రాజకీయాల్లో ఎన్‌టిఆర్‌ది బలమైన ముద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత రాజకీయాలలో నందమూరి తారకరామారావు బలమైన ముద్ర వేశారని, అభివృద్ధి, సంక్షేమానికి సరికొత్త నిర్వచనంగా ఆయన పాలన సాగిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దసపల్లా హోటల్‌లో ఎన్‌టిఆర్‌పై వెలువరించిన శాసనసభ ప్రసంగాలు, చారిత్రక ప్రసంగాలు, శకపురుషుడు అనే మూడు గ్రంథాలపై సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌టిఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ నిర్వాహకులైన ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్ సైట్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టిడి.జనార్ధన్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు సబ్సిడీ బియ్యం పథకాన్ని, పక్కా గృహాల స్కీంను, మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన వాటా మొదలైన చారిత్రక నిర్ణయాలను అమలు చేసి సమాజంలో పేదల జీవన ప్రమాణాలు పెంచారన్నారు. కార్యక్రమంలో బోడేపూడి ప్రసాదరావు, మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌డిపి.అప్పల నరసింహరాజు, గండి బాబ్జీ, మానం ఆంజనేయులు, పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, గీతం విద్యాసంస్థల అధ్యక్షులు ఎం.శ్రీభరత్ పాల్గొన్నారు.

జిఓ 21ని రద్దు చేయాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆటో, మోటారు రంగంపై అధిక జరిమానాలు విధించే జిఓ 21ని రద్దు చేయాలని విశాఖపట్నం జిల్లా ఆటో మోటారు రంగ కార్మికుల సంఘం (ఎఐటియుసి) జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహమాన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో, మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్.కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ప్రసాద్

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - చింతూరు : వరదల కారణంగా రహదారులపై, నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగునీరు తొలగించే కార్యక్రమం చింతూరు పంచాయతీ పరిధి ఎర్రంపేటలో ఆదివారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు పారిశుధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా చేశారు. ఆదివారం స్థానిక ఏజిహెచ్‌ఎస్ ఆశ్రమ పాఠశాల, ఎస్ఎంఎస్ హాస్టల్, బాలుర ఎస్ఎంఎస్ హాస్టల్, మండల కేంద్రంలోని బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, గొల్ల బజార్, గుభేలుపేట తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. బ్లీచింగ్ చల్లారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణ కార్యక్రమం చేపట్టారు.

చుండూరు హంతకులను శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చుండూరు దళితులపై ఆధిపత్య కులాల హత్యాకాండ జరిగి 32 ఏళ్లయినా ఇంతవరకూ న్యాయం జరగలేదని దళిత సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఘటన రోజును పురస్కరించుకని ఆదివారం దళిత విముక్తి సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. చుండూరు హంతకులు ఎక్కడంటూ నినదించారు. సంస్థ రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, హెచ్ఆర్ఎఫ్ నాయకులు విఎస్.కృష్ణ, డాక్టర్ పిజె.సుధాకర్, దళిత హక్కుల సమాఖ్య నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, భీమ్ సేన ప్రధాన కార్యదర్శి ఎం.రవి సిద్ధార్థ మాట్లాడుతూ ప్రభుత్వాలతీరును దుయ్యబట్టారు. 1991 ఆగస్టు 6న చుండూరులో కొందరు మారణకాండకు పాల్పడి ఎనిమిది మంది దళితులను హతమార్చారని గుర్తు చేశారు. ఈ కేసులో సాక్షాధారాలు ఉన్నప్పటికీ 13 ఏళ్ల తర్వాత కొంత మేరకే న్యాయం జరిగిందని చెప్పారు. హైకోర్టు ఈ కేసును కొట్టివేసి హంతకులను వదిలేసిందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు, కోర్టులో పోలీసులు హంతకులకు కొమ్ము కాయడం వల్లే అన్యాయం జరిగిందన్నారు. సుప్రీంకోర్టులో ఈ కేసును అప్పీలు చేసినప్పటికీ త్వరితగతిన పరిష్కారం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి చొరవ కొరవడిందన్నారు. దళిత, బహుజనులకు రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగాన్ని నేడు మార్చివేసే కుట్ర కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో దళిత విముక్తి ప్రతినిధులు బి.అప్పారావు, బి.సన్యాసమ్మ, బి.రామకృష్ణ, కె.కుమార్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధి ఎస్.గురవయ్య, భారత నాస్తిక సమాజం నాయకులు రాంప్రభు, దళిత కళామండలి ప్రతినిధి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉక్కునగరం : అమృత్ భారత్ పథకంలో భాగంగా దువ్వాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. దేశ వ్యాప్తంగా 508 స్టేషన్ల అభివృద్ధికి వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయగా, అందులో దువ్వాడ స్టేషన్ ఉన్నట్టు డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్‌ను రూ.26 కోట్లతో మరింత అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఎంపీ జివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ విశాఖపట్నం అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టిందన్నారు. వాల్తేరు రైల్వే డివిజన్‌లో త్వరలో చేపట్టబోయే పనులను వివరించారు. విశాఖలో మెగా ఫిషింగ్ హార్బర్, స్మార్ట్ సిటీని అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బిజెపి నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, ఎయు విసి ప్రసాదరెడ్డి, పద్మశ్రీ కె.సూర్యారావు పాల్గొన్నారు.